భూ భారతి చట్టం ద్వారా రైతులకు మేలు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్ : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, వేదికపై ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్/ నకిరేకల్/ కేతేపల్లి/ నార్కట్‌పల్లి/చిట్యాల, ఏప్రిల్ 23 : ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ద్వారా రైతులకు మేలు కలుగుతుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నా రు. బుధవారం కట్టంగూర్, కేతేపల్లి, చిట్యాల తాసీల్దార్ కార్యాలయం ఆవరణలో, నకిరేకల్ సాయిబాబా మందిరంలో, నార్కట్‌పల్లిలోని జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు అధికార వికేంద్రీకరణ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ చట్టంలో అనుభవదారుడికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. గతంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా భూ సమస్యలు తలెత్తాయని, వాటిని పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, తప్పులు జరిగితే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కట్టంగూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓ యారాల అశోక్‌రెడ్డి, తాసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, మండల ప్రత్యేకాధికారి కోటేశ్వర్‌రావు, మాజీ ప్రజాప్రతినిధులు, నకిరేకల్‌లో పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ చౌగోని రజితాశ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్, తాసీల్దార్ ఎస్‌కే జమీరొద్దీన్, ఎంపీడీఓ చంద్రశేఖర్, నార్కట్‌పల్లిలో డీఆర్‌డీఓ వై. అశోక్‌రెడ్డి, తాసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ ఉమేశ్, కేతేపల్లిలో డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజులామాధవరెడ్డి, తాసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, చిట్యాలలో తాసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ జయలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్మన్ చిన వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రఘుమారెడ్డి పాల్గొన్నారు.

నిలిచిన కాంటాలు.. ఇబ్బందుల్లో రైతులు

ముప్పారం కొనుగోలు కేంద్రంలో ఇష్టారాజ్యం

ముప్పారం కేంద్రంలో నిలిచిన కాంటాలు

నిడమనూరు, ఏప్రిల్ 23 : మండలంలోని ముప్పారం గ్రామంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రంలో బుధవారం కొనుగోళ్లు నిలిచి పోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం కాంటా వేసిన ధాన్యాన్ని ఎగుమతి చేయగా మిల్లుల్లో దిగుమతి కాకపోవడంతో నిర్వాహకులు కాంటాలు నిలిపివేశారు. దాంతో రైతులు మండు టెండలో నానా అవస్థలు పడ్డారు.

ఇష్టారాజ్యంగా కొనుగోళ్లు

ముప్పారం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు ఇష్టారాజ్యంగా చేపడుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని తేమ ఆధారంగా సీరియల్‌గా కాంటాలు వేయాల్సి ఉన్నా నిర్వాహకులు సీరియల్‌ను కాదని చేతులు తడిపిన వారి ధాన్యాన్ని ముందుగా కాంటా వేస్తున్నారని పలువురు రైతులు ఆరోన్నారు. 40 కిలోల బస్తాలో ప్రభుత్వ నిబంధనల మేరకు 40 కిలోల 700 గ్రాముల ధాన్యాన్ని కాంటా వేయాల్సి ఉండగా 42.50 కిలోల వరకు కాంటా వేస్తున్నట్లు సమాచారం. గన్నీ సంచుల పంపిణీలోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, మోతుబరి రైతుల ఇండ్లకే బస్తాలు పంపిణీ చేస్తున్నారని తెలిసింది. ఐకేపీ కేంద్రం ఏర్పాటుకు స్థలం ఇచ్చిన బడా రైతు, ఆయన భూముల కౌలు దారుల పేరుతో ఒక్క రోజే 1600 గన్నీ సంచులు ఇచ్చినట్లు సమాచారం. కేంద్రం వద్ద ట్యాబ్‌లో రైతుల వివరాలు నమోదు చేయాల్సిన ఆపరేటర్ తన ఇంట్లోనే ఉంటూ వివరాలు నమోదు చేస్తుండటంతో రైతులు ఆమె ఇంటికి వెళ్లాల్సి వస్తున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కొనుగోళ్లలో అవకతవకలు పారదర్శకంగా జరిగే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏపీఎం లక్ష్మీనారాయణను వివరణ కోరగా కేంద్రం నిర్వహణకు స్థలం ఇచ్చిన పెద్ద రైతుకు నిర్వాహకులు గన్నీ సంచులు ఇచ్చిన మాట వాస్తవమే అన్నారు. బస్తాకు 43 కిలోల ధాన్యం కాంటా వేసిన విషయం తమ దృష్టికి రాలేదని, విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కాంటా వేసిన ధాన్యం మిల్లుల వద్ద సకాలంలో దిగుమతి కాకపోవడంతో కాంటాలు ఆలస్యమవుతున్నట్లు వివరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి , వేదికపై మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

బీఆర్ఎస్‌కు పూర్వవైభవం ఖాయం

- వరంగల్ సభను విజయవంతం చేయాలి
- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

గుర్రంపోడ్, ఏప్రిల్ 23 : ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఇప్పటికే తీవ్ర అసంతృప్తి ఉందని, రాబోయే రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. బుధవారం గుర్రంపోడ్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నాగులవంచ తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజల మనస్సులో బీఆర్ఎస్ పార్టీపై, కేసీఆర్ పరిపాలనపై సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వజ్జ రామేశ్వరీ ధనుంజయ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాపానగుండ్ల వెంకన్న, నాయకులు మేకల వెంకట్‌రెడ్డి, పోలె రామచంద్రం, బచ్చనబోయిన శ్రీను, వడ్త్య నాగరాజునాయక్, తేలుకుంట్ల కుర్మాల్‌రెడ్డి, సింగం ప్రవీణ్, కామల్ల రాములు, నాగులవంచ నాగేశ్వర్‌రావు, గోన రామారవు, షేక్ సిరాజు, కూనూరు సైదిరెడ్డి, వేముల యాదయ్య, పర్వనబోయిన వెంకన్న, దోటి గణేశ్, మేడి లింగయ్య పాల్గొన్నారు.

చేనేత వృత్తిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్

సమావేశంలో మాట్లాడుతున్న గంజి మురళీధర్

రామగిరి, ఏప్రిల్ 23 : చేనేత వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, జియో ట్యాగ్ నంబర్ ఇచ్చిన అనుబంధ కార్మికులందరికీ త్రిఫ్ట్ పథకం వర్తింపజేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. నల్లగొండలోని సుందరయ్య భవనంలో బుధవారం ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని, దాంతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. మరికొంత మంది వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తమ సంఘం ఆధ్వర్యంలో చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజా రామయ్యర్‌ను కలిసిన సందర్భంలో కార్మికులందరికీ జియోట్యాగ్ అమలు చేస్తామని, రుణామాఫీ వెంటనే అమలు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దానికి కింది స్థాయి అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీచేసి అమలు జరిగే విధంగా చూడాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కందగట్ల గణేశ్, ఉపాధ్యక్షుడు కర్నాటి శ్రీరంగం, సహాయ కార్యదర్శి వనం రాములు, నాయకులు వాలుగొండ మధు, ఏలే శ్రీనివాస్, గడ్డం దశరథ, దయానంద్, రావిరాల వెంకటేశం పాల్గొన్నారు.

ఉగ్రదాడి హేయమైన చర్య

- మండలి చైర్మన్ గుత్తా

రామగిరి, ఏప్రిల్ 23: ఉగ్రవాదం సమాజం మనుగడకు పెను సవాలు విసురుతున్నదని, జమ్ముకాశ్మీర్‌లోని పహెల్‌గాంలో జరిగిన ఉగ్రదాడి హేయమైన చర్య అని, దీనిని ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో హింసను సహించరాదని, కశ్మీర్‌లో రక్తపుటేరులు పారించిన మూకల మీద కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఐలు ఖండన

నీలగిరి : పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని అలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల శంకరయ్య బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమైన, క్రూరమైన చర్యగా అభివర్ణించారు. ముష్కరులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కశ్మీర్‌లోని పహల్గాంలో యాత్రికులపై ఉగ్రవాదుల దాడిచేయడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, జిల్లా కమిటి సభ్యుడు ఎండీ సలీం వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. నిందితులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతుల కుంటుంబానికి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్య పెంచాలి

- వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ అజయ్‌కుమార్

మర్రిగూడ, ఏప్రిల్ 23 : ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్యను పెంచాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ సూచించారు. బుధవారం మర్రిగూడ సీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ కాన్సన్ ట్రేటర్‌ను ఆయన ప్రారంభించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 30 పడకల ఆస్పత్రి ఉన్నందున రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట డీసీహెచ్‌ఓ డాక్టర్ మాత్రు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ నాయక్, స్థానిక వైద్యులు ఉన్నారు.

కర్రెగుట్టల్లో మిలటరీ ఆపరేషన్‌ను నిలిపివేయాలి

- ప్రజాసంఘాలు, విద్యావంతుల వేదిక

నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నీలగిరి, ఏప్రిల్ 23 : తెలంగాణ-ఛతీశ్‌ఘడ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో జరుగుతున్న మిలటరీ ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టుల పేరుతో ఆదివాసీలపై జరుపుతున్న కాల్పులను, హింసను నిలిపివేయాలని ప్రజా సంఘాలు, విద్యావంతుల వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూంబింగ్‌ను విరమించుకొని శాంతి నెలకోల్పేందుకు చర్చలు జరుపాలని డిమాండ్ చేశారు. శాంతియుత పరిస్థితిని నెలకొల్పేందుకు మేధావులు, ప్రజాస్వామిక వాదులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మావోయిస్టులు స్వయంగా కాల్పుల విరమణకు, చర్చలకు ముందుకు వచ్చాయని, పాలకులు కూడా వారితో చర్చలు జరిపి శాంతియుతంగా సమస్యను పరిష్కారించాలని కోరారు. సమావేశంలో టీపీఎఫ్ నాయకులు సీహెచ్ సుధాకర్‌రెడ్డి, బి.రామ య్య, రుద్రాక్షి దుర్గయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఇందూరు సాగర్, ఐఎఫ్‌టీయూ నాయకుడు నర్సింహ, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకుడు పందుల సైదులు, పీవైఎల్ నేత బీవీ చారి, హెచ్‌ఆర్‌ఎఫ్ నాయకుడు గురువయ్య, అఖిల భారత రైతుకూలి సంఘం నాయకుడు కె. అనంతరెడ్డి, ఎస్‌జీపీఏటీ నాయకుడు దాడి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు : ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూర్, ఏప్రిల్ 23 : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ అవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ యారాల అశోక్‌రెడ్డి, హౌసింగ్ డీఈ రామకృష్ణారెడ్డి. మండల ప్రత్యేకాధికారి కోటేశ్వర్‌రావు, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

- ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ నర్సింహ

శివన్నగూడెం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బాలం నర్సింహ

మర్రిగూడ, ఏప్రిల్ 23 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు జరుపాలని ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ బాలం నర్సింహ నిర్వాహకులకు సూచించారు. బుధవారం మండలంలోని శివన్నగూడెం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. రైతుల ధాన్యాన్ని ఎప్పటికప్పుడు టోకెన్ నంబర్ ప్రకారం కాంటా వేయాలన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున కేంద్రాల్లో వసతులు కల్పించాలని సూచించారు. ఆయన వెంట సీఈఓ మధూకర్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బీరు సీసాతో దాడి చేసిన ఇద్దరిపై కేసు

చికిత్స పొందుతున్న బాధితుడు ప్రకాశ్

నకిరేకల్, ఏప్రిల్ 23 : మద్యం మత్తులో బీరు సీసాతో దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణానికి చెందిన బోయిళ్ల జానమ్మ తాటికల్ రోడ్డులో నివాసముంటున్నారు. ఆమె కూతురు చింతమల్ల కృష్ణవేణి అల్లుడు రాహుల్ మధ్య కొంత కాలంగా కుటుంబ కలహాలు నడుస్తున్నాయి. తన బిడ్డ కాపురం చక్కదిద్దాలనే ఉద్దేశంతో జానమ్మ నల్లగొండ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేసింది. మే ఒకటో తేదీన భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఉంటుందని పోలీసులు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి చింతమల్ల రాహుల్ తన స్నేహితుడు రవి మరికొంత మందితో కలిసి మద్యం మత్తులో జానమ్మ ఇంటిపై బీరు సీసాలతో దాడిచేశాడు. ఈ ఘర్షణలో జానమ్మ తమ్ముడు ఎడ్ల ప్రకాశ్ గొంతుపై, ఆమె ఇద్దరు అల్లుళ్ల చేతిపై, శరీరభాగాలపై గాయాలయ్యాయి. క్షతగాత్రులను నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. ఈ విషయమై బోయిళ్ల జానమ్మ ఫిర్యాదు మేరకు రాహుల్, రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. వీరితో పాటు దాడి చేసిన మరికొంతమంది కోసం గాలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బీఆర్ఎస్ వరంగల్ సభను విజయవంతం చేయాలి

చందంపేట, ఏప్రిల్ 23 : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని మాజీ జడ్పీటీసీ బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు యాసాని రాజవర్ధన్‌రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. వరంగల్ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని, గ్రామాల్లో ఈ మేరకు విస్తృత ప్రచారం చేయాలన్నారు. 27న గ్రామ గ్రామాన పార్టీ జెండాలను ఎగురవేయాలని కోరారు.

ప్రతి పల్లెలో గులాబీ జెండా ఎగురవేయాలి : వల్లపురెడ్డి

పెద్దఅడిశర్లపల్లి : ఈ నెల 27 బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవం సందర్భంగా ప్రతి పల్లెలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని పార్టీ మండల అధ్యక్షుడు వల్లపురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వరంగల్ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేందుకు ఇప్పటికే వాహనాలు కేటాయించినట్లు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

రామగిరి, ఏప్రిల్ 23: ఈ నెల 25 నుంచి 27 వరకు ఖమ్మం పట్టణంలో జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం నాయకులు కోరారు. మహాసభల పోస్టర్లను బుధవారం ఎంజీయూలో వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రియతో కలిసి వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సంపత్, అభినయ్, సౌమ్య, అమూల్య, నవ్య పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లోనూ బడిబాట చేపట్టాలి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 23: వేసవి సెలవుల్లోనూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా బడిబాట కార్యక్రమం చేపట్టాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని ప్రధానోపాధ్యాయు లు, ఉపాధ్యాయులతో బుధవారం ఆయన జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. వారం రోజులుగా ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల పేర్లను నమోదు చేయిస్తున్నందుకు వారిని అభినందించారు. అదే స్ఫూర్తితో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లల జాబితాను అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సేకరించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులను ఒప్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. నిరుపేద, అట్టడుగు వర్గాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని, ఉపాధ్యాయులు వారికి ఉత్తమ విద్యనందించాలని కోరారు. ఆయన వెంట ఎంఈఓలు బాలాజీనాయక్, లక్ష్మణ్‌నాయక్, వరలక్ష్మి, వెంకటమ్మ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

- ఎంపీడీఓ, సీడీపీఓ

గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సీడీపీఓ లావణ్యకుమారి, ఎంపీడీఓ శాంతకుమారి

మునుగోడు, ఏప్రిల్ 23: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఎంపీడీఓ శాంతకుమారి, సీడీపీఓ లావణ్యకుమారి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో పోషణ్ అభియాన్‌లో భాగంగా చిన్నపిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు శివేష, అంగన్‌వాడీ టీచర్ పాల్వాయి వినోద, నాయకులు పాల్వాయి జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య : ఎంఈఓ

బడిబాట ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంఈఓ నాగేశ్వర్‌రావు

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 23 : విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంఈఓ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు యూనిఫాం, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, నోట్స్ అందిస్తున్నట్లు తెలిపారు. ఫీజుల భారం లేకుండా కార్పొరేట్ స్థాయిలో విద్యనందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం 6,7,8,9 తరగతుల విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మే 20న కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మె

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

గుర్రంపోడ్, ఏప్రిల్ 23: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై మే 20న 11 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నీలం ఆంజనేయులు అధ్యక్షతన మండల కేంద్రంలో జరిగింది. సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు భాగస్వాములై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల రెక్కల కష్టంతో నిర్మించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రధాని మోదీ కార్పొరేట్ శక్తులకు ధారా దత్తం చేస్తున్నారని విమర్శించారు. 11ఏండ్ల బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అథోగతి పాలైందన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు వనమాల కామేశ్వర్, సీఐటీయూ మండల కన్వీనర్ పి. సర్వయ్య, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 23 : రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ చేసేందుకు గురువారం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ వేణుగోపాలచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు గవర్నమెంట్ ఆస్పత్రి ఏరియా, దారుషఫా కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

దేవరకొండలో..

దేవరకొండరూరల్ : మండలంలోని 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు చేపడుతున్నందున గురువారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ముదిగొండ సబ్‌స్టేషన్ పరిధిలోని ముదిగొండ, గొట్టిముక్కల, కర్నాటిపల్లి, కమలాపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ బి.రాజేశ్ తెలిపారు.

త్రిపురారంలో..

త్రిపురారం : స్థానిక సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ త్రిపురారం టౌన్ ఫీడర్ లైన్‌కు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించడం, 11కేవీ లైన్ ఏబీ స్విచ్ ఏర్పాటు పనులు చేస్తున్న నేపథ్యంలో గురువారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ బాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రిపురారం టౌన్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు, కంపసాగర్ పరిధిలోని మిర్యాలగూడ మున్సిపల్ వాటర్ వర్క్స్, ఎన్‌జీరంగా వ్యవసాయ విజ్ఞానకేంద్రం, కేవీకే, మోడల్‌స్కూల్, కేజీబీవీ స్కూళ్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోప్ జాన్‌పాల్ ప్రాన్సిస్ మృతికి సంతాపం

పోప్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న క్రైస్తవులు

రామగిరి, ఏప్రిల్ 23: పోప్ జాన్‌పాల్ ప్రాన్సిస్ మృతికి పలువురు సంతాపం తెలిపారు. బుధవారం నల్లగొండలోని గడియారం సెంటర్‌లో తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆవరణలో పోప్ చిత్రపటానికి క్రైస్తవులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్రైస్తవ పెద్దలు క్రిస్టఫర్, పసల శౌరయ్య, రేకల భద్రాద్రి, ప్రవీణ్‌కుమార్, బెంజిమిన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

పెద్దవూర : వెల్మగూడెం ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెద్దవూర, ఏప్రిల్ 23: మండలంలోని వెల్మగూడెం ప్రాథమిక పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ తరిరాము ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్నెం వెంకటేశ్వర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బాషిపాక లక్ష్మీసురేందర్, ఉపాధ్యాయులు మహ్మద్ రహీం, నామిరెడ్డి ప్రశాంతి, ఉప్పునూతల వెంకయ్య పాల్గొన్నారు.

చందంపల్లి పాఠశాలలో ..

నకిరేకల్ : మండలంలోని చందంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. విద్యాసంవత్సరం ముగింపు సందర్భంగా ఆయా తరగతుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఈ-ప్రగతి పత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కనుకుంట్ల నవీన్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మునుగోటి ఎస్తేర, మాజీ సర్పంచ్ నూకల రఘునందన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన **యంపళ్ళ వెంకన్న**, తండ్రి : **లింగయ్య**, వయస్సు. 44 సం॥లు, వృత్తి : Pvt.Employee, నివాసం : నెరటినిగూడెం, H/o. సింగారం గ్రామం, మునుగోడు మండలం, నల్లగొండ జిల్లా గారు ఇచ్చు ప్రకటన ఏమనగా నా యొక్క దాన దస్తావేజు నెం. **738/2012**, SRO-Chandur ఇట్టి దస్తావేజు మునుగోడు నుండి సింగారం వెలుచుండగా మార్గ మధ్యలో పోయినది కావున ఇట్టి విషయము మునుగోడు పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు నమోదు చేసినారు సదరు ఆస్తి యొక్క వివరములు వ్యవసాయ భూమి సర్వే నెం. 433, 434, 435/ఇ, 436/2, 454/అ & 454 మొత్తం విస్తీర్ణం Ac.3.19 Gts., మునుగోడు గ్రామం & మండలం నల్లగొండ జిల్లా సదరు ఆస్తి యొక్క హద్దులు : **ఉత్తరం** : ఎన్.భిక్షమయ్య వ్యవసాయ భూమి, **దక్షిణం** : డి.దశరథ & ఇతరుల వ్యవసాయ భూమి, **తూర్పు** : వై.నరసింహ వ్యవసాయ భూమి, **పడమర** : వై. అంజయ్య వ్యవసాయ భూమి, ఎవ్వరికైనను పై దస్తావేజు దొరికినచో నా క్లైయింటుకు తిరిగి ఇవ్వగలరు. ఇట్టి విషయంపై ఎవ్వరికైనను ఎటువంటి అభ్యంత్రముననచో తగిన ఆధారములతో (7) వారం రోజులలో ఈ క్రింది తెలిపిన అడ్రస్‌లో సంప్రదించగలరు.

నాంపల్లి చంద్రశేఖర్
న్యాయవాది & నోటరీ
ఇ.నెం. 6-2-439/1, శ్రీనగర్ కాలనీ,
నల్లగొండ - 508001, తెలంగాణ.
సెల్ : 9440422393

నల్లగొండ
తేది.3-04-2025

మోడల్ స్కూల్ విద్యార్థులకు సన్మానం

విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మర్రిగూడ,ఏప్రిల్ 23 : ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థులను బుధవారం ప్రిన్సిపాల్ శివ స్వరూపా రాణి శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫస్టియర్ ఎంపీసీలో మాదగోని కావ్య 457, కల్లెట్ల పునీత 432, సీనియర్ ఎంపీసీలో జంపాల తేజశ్రీ 973, మాదగోని శ్రావ్య 950 మార్కులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం

కట్టంగూర్, ఏప్రిల్ 23 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ అంబటి అంజయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి జీవితంలో విజయాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు మార్కుల పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొంక ఆంథోని, అబ్దుల్ గఫూర్, చిన్ని శ్రీనివాస్, సునంద, లేజస్విని, పీడీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చెప్పులు పంపిణీ

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 23 : నార్కట్‌పల్లి బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం చిట్యాల భజన మండలి సభ్యులు చెప్పులు, పులిహోర, స్వీట్స్, బిస్కెట్‌లు పంపిణీ చేశారు. సత్యసాయిబాబా ఆరాధన దినోత్సవం సందర్భంగా తాము విద్యార్థులకు వీటిని పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మేడిశెట్టి ఝాన్సి, చందా నాగలక్ష్మి, జ్యోతి, పద్మజ, జయ, స్పందన, జానమ్మ, ధనమ్మ, పద్మ, చక్రమ్మ, వేణుమాధవ్, డి.భారతి, భాను, విజయలక్ష్మి, జయ. స్వప్న, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు : తాసీల్దార్

మర్రిగూడ,ఏప్రిల్ 23 : మండల కేంద్రంలోని జీకేఆర్ ఫంక్షన్ హాల్లో గురువారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తాసీల్దార్ బక్క శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సదస్సుకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.